ప్రజాశక్తి

శనివారం 19 జూలై 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

బాబోయ్.. స్మార్ట్ మీటర్లు


◆ భారీగా బిల్లులు రావడంతో వినియోగదారులు బెంబేలు

◆ మునగపాక రైతుల్లో తీవ్ర ఆందోళన

ప్రజాశక్తి - మునగపాక

అనకాపల్లి జిల్లా మునగపాక మండలంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిల్లులతో జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. రూ.వేలల్లో బిల్లు భారం ఉంటోందని జనం గగ్గోలు పెడుతున్నారు. వ్యవసాయ మోటార్లకు పెట్టిన మీటర్లు మరీ ఎక్కువగా బిల్లు పేరిట దోచేస్తున్నాయి.

వ్యవసాయం జీవనాధారంగా బతుకు వెళ్లదీస్తున్న రైతన్నలే ఈ మండలంలో ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వ విధానాలతో ఇప్పటికే వీరి పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారైంది. పంటలకు పెట్టిన పెట్టుబడులకు పోను కాస్త మొత్తాలే మిగులుతున్నాయి. వాటితోనే కుటుంబాలను ఈడ్చుకొస్తున్నారు. గతేడాది జూన్‌లో మండల కేంద్రం మునగపాకలో గుట్టు చప్పుడు కాకుండా రైతుల వ్యవసాయ మోటార్లకు అదానీ కంపెనీ ప్రతినిధులు స్మార్ట్ మీటర్లు బిగించడం మొదలు మిగతా 2లో..



బిగించిన స్మార్ట్ మీటర్

వ్యవసాయ మోటారుకు రూ.15 వేలు బిల్లు



నా వ్యవసాయ మోటారుకు ఇప్పుడు అధిక బిల్లు వస్తోంది. నాడు ఉచిత విద్యుత్ అమలయ్యేది. మినిమం బిల్లు వచ్చేది. దానిని సులువుగా కట్టేసేవాడిని. స్మార్ట్ మీటర్ అమర్చిన తర్వాత రూ.15 వేల బిల్లు వచ్చింది. ఇప్పటికే వ్యవసాయం గిట్టుబాటు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ తరుణంలో ఈ స్మార్ట్ మీటర్లు బిగింపు వల్ల వేలకు వేలు బిల్లులు వస్తున్నాయి. ఇక తినేదేముంది. పండించేదేముంది.

కడియం కృష్ణ గోవిందరావు, రైతు

నాడు రూ.400.. నేడు రూ.2 వేలు



మా ఇంటికి స్మార్ట్ మీటర్ అమర్చక ముందు రూ.400 నుంచి 500 వరకూ కరెంట్ బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటర్ బిగించిన తరువాత రూ.2 వేలు వస్తోంది. స్మార్ట్ మీటర్ అమర్చినందుకు మా నుండి రూ.50 తీసుకొని చకచకా పని పూర్తి చేశారు. బిల్లు ఏ విధంగా కట్టాలో కూడాదో చెప్పలేదు. ఆ మీటర్ ఎలా పనిచేస్తుందో కూడా తెలియజేయలేదు. ఇదే మాదిరిగా బిల్లులు కొనసాగితే దీపం బుడ్లు, విసనకర్రలే గతి.

- కడియం సూర్య గోవిందరావు, వెంకటాపురం గ్రామం

వేడి దాడి



◆ ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న జనం

◆ అప్పుడప్పుడూ, అక్కడక్కడా మాత్రమే వర్షాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వారం రోజులుగా ఉష్ణోగ్రతల దాడితో విశాఖ వాసులు అల్లాడిపోతున్నారు. వర్షాకాల సమీపాన ఇంత వేడి తామెప్పుడూ చూడలేదని వాపోతున్నారు. ఈ పరిస్థితులపై వాతావరణ శాస్త్రవేత్తలు స్పందిస్తూ.. 'వచ్చిన మేఘాలు వచ్చినట్టే వెళ్లిపోతున్నాయి. వానలు తక్కువైపోతున్నాయి. తేమను తీసుకురావాల్సిన మేఘాలు ఒంటిగా రావడంతో గాలిలో తేమ పరిస్థితులు క్షీణించి వర్షాలకు ఆస్కారం లేకుండా పోతోంది' అని చెప్పుకొస్తున్నారు. విశాఖలో కొద్ది రోజులుగా అక్కడక్కడా, అప్పుడప్పుడూ క్యుములోనింబస్ మేఘాలు వచ్చినచోట మాత్రమే కాస్త వర్షాలు పడుతున్నాయి. ఉష్ణోగ్రతలు వేసవి మాదిరి ఉండటంతో ఇంట్లోంచి రోడ్డు మీదకు కాలుమోపాలంటేనే ప్రజలు భయాందోళనకు గురౌతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. 35 డిగ్రీల వేడిని గడచిన నాలుగైదు రోజులుగా విశాఖ ప్రజలు చూస్తున్నారు. వాస్తవానికి 35 డిగ్రీలు ఇంతకు ముందు కూడా ఉన్నప్పటికీ ఇంత వేడి వాతావరణం గతంలో లేదన్నది నిజం. వర్షపాతం కూడా ఈ ఏడాది జులై 12 నుంచి 16 వరకూ విశాఖలో నిల్. మరలా 17న 11.0 మిల్లీమీటర్లు పడింది. 18న శుక్రవారం విశాఖ ఎయిర్‌పోర్టు ఏరియాలో మాత్రం 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

విశాఖలో ఈ నెలలో ఒకటి రెండు రోజులు అడపా దడపా మినహా దాదాపు వర్షం శూన్యమనే చెప్పాలి. దీంతో జనం వేడి పరిస్థితులను ఎదుర్కొనాల్సి వచ్చింది. అయితే జనం ఇప్పుడింతగా భయపడడానికి కారణాలను విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు పరిస్థితులనుబట్టి విశ్లేషించారు పలు ఆసక్తికర విషయాలను శుక్రవారం వెల్లడించారు. ఉండాల్సిన ఉష్ణోగ్రతల కంటే 3 డిగ్రీలు ఈ నెలలో అధికంగానే ఉన్నాయని తెలిపారు.

24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ?

వేడి వాతావరణ పరిస్థితులు ఈ మాసమంతా కొనసాగే అవకాశాల్లేవని వారు చెబుతున్నారు. 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేందుకు మిగతా 2లో..

మినీ థాయ్ స్పాపై టాస్క్‌ఫోర్స్ దాడులు

▶ వార్త 2లో..

ఆశావహ జిల్లాల అభివృద్ధికి సహకారం

▶ వార్త 2లో..

వడ్డాది పోస్టాఫీసులో రూ.8.32 లక్షల స్వాహా

▶ వార్త 6లో..



నిస్తార్ జలప్రవేశ కార్యక్రమంలో కేంద్ర మంత్రి సంజయ్ సేత్

ఐఎన్ఎస్ నిస్తార్ జాతికి అంకితం

నౌకా నిర్మాణ అధ్యాయంలో గొప్ప మైలురాయి

వార్త మెయిన్‌లో..

మెట్రోపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ మెట్రోరైల్ ప్రాజెక్టు అమలు అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) సుధా సాగర్ ఆధ్వర్యంలో విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టు (విఎంఆర్‌పి) అమలులో భాగంగా భూముల సేకరణకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భూసేకరణ, పునరావాసం, న్యాయమైన పరిహారంపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, స్థానికులు సుమారు 200 మంది వరకు హాజరయ్యారు. విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ వెలంపేట, కల్లుపాకలు నివాసితులు మెట్రోరైలును వ్యతిరేకిస్తున్నారని, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. సాధిక్ మాట్లాడుతూ మెట్రో రైలును స్వాగతించారు. అయితే ఈ ప్రాజెక్టు అమలులో స్థలాలు, భవనాలు కోల్పోయే వారికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. చివరిస్టాప్ లక్ష్మీటాకీస్ పార్క్ వద్ద నిర్మిస్తే బాగుంటుందని సూచించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు వ్యాపారులు, ముఖ్యంగా మెట్రో మార్గంలో షాపులు కలిగి ఉన్నవారు ఈ ప్రాజెక్టును వ్యతిరేకించారు.

అన్యాయంగా తొలగించొద్దు

జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌ను ముట్టడించిన ఆర్‌పిలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో అన్యాయంగా తొలగిస్తున్న ఆర్‌పిలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మేఘాలయ హోటల్ వద్ద 22వ వార్డు జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌ను పలువురు ఆర్‌పిలు ముట్టడించారు. విషయం తెలియడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అడ్డగించారు. కార్పొరేటర్ చెప్పడంతో తొలగించిన ఆర్‌పిలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఆర్‌పిలు డిమాండ్ చేశారు. తనకు నచ్చిన ఆర్‌పిలను ఉంచి, కక్షపూరిత రాజకీయాలతో ఇద్దరు ఆర్‌పిల జీవితాలను కార్పొరేటర్ మూర్తి యాదవ్ రోడ్డున పడేశారని తెలిపారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించాలన్నారు. కార్పొరేటర్ వేధింపుల నుండి కాపాడాలన్నారు. మూర్తి యాదవ్ తమ పొట్టగొడుతున్నారని ఆర్‌పిలు చంద్రకళ, జానకి వాపోయారు. తొలుత వారు 22వ వార్డు పిఠాపురం కాలనీ నుండి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. మూర్తి యాదవ్ మేఘాలయ హోటల్‌లో ఉన్నారని తెలిసి ఆర్‌పి గ్రూపుల సభ్యులు ముట్టడించారు. దీంతో పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు పోరాటాన్ని ఆపలేదు. జివిఎంసి కమిషనర్, మెప్మా ఎమ్‌డి స్పందించి మూర్తి యాదవ్ వేధింపులు ఆపి, తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న ఆర్‌పిలు

మొదటి పేజీ తరువాయి..

బాబోయ్.. స్మార్ట్ మీటర్లు

పెట్టారు. ఆ సమయంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులంతా తిరగబడ్డారు. దరిమిలా అప్పట్లో ఆ మీటర్లను అమర్చకుండా వెనుదిరిగారు. ఆ తరువాత కాలంలో అక్కడక్కడా మీటర్లను గుట్టుచప్పుడు కాకుండా బిగించారు. మండల వ్యాప్తంగా వ్యవసాయ మోటార్లు 3194 ఉండగా 175కిపైగా స్మార్ట్ మీటర్లను రైతుల మోటార్ పంపుసెట్లకు అమర్చారు. ఇది చాలదన్నట్లుగా చిన్నాచితకా వ్యాపారం చేసుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్న 1200 మంది చిరు వ్యాపారుల వ్యాపార సముదాయాలకు స్మార్ట్ మీటర్లను బిగించేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గృహ అవసరాలకు సంబంధించి వినియోగదారుల నుంచి రూ.50 తీసుకొని విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వ్యవసాయ మోటార్లకు అమర్చిన స్మార్ట్ మీటర్ల బిల్లులు ఎక్కువ రావడానికిగల కారణాలపై ఎఇ జగదీష్‌ను వివరణ కోరగా 24 గంటల పీడర్లలోగల వ్యవసాయ మోటార్లకు 6000 యూనిట్లు దాటివాడితే ఎపిఇఆర్‌సి నిబంధనల ప్రకారం అదనపు చార్జీలు పడతాయని చెబుతున్నారు.

నిలువు దోపిడీ చేసేందుకే..



కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రైవేటీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను అమరుస్తోంది. ఇది రైతాంగాన్నీ, ప్రజలనూ నిలువు దోపిడీ చేయడమే అవుతుంది. ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించింది. అధికారం చేపట్టాక మాట తప్పింది. గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే చంద్రబాబు సర్కారు అమలుచేస్తోంది. ఇప్పటికైనా పునరాలోచించి స్మార్ట్ మీటర్లను తొలగించి అన్నదాతలను ఆదుకోవాలి.

గనిశెట్టి సత్యనారాయణ,
మాజీ ఉపసర్పంచ్, వెంకటాపురం గ్రామం

వేడి దాడి

అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోవచ్చనే ఒక అంచనాతో వారున్నారు.

నైరుతి ఇబ్బంది పెడుతోందంటున్న శాస్త్రవేత్తలు

రాష్ట్రంలోకి ఈ ఏడాది మే 26న నైరుతి రుతుపవనాలు వచ్చాయి. విశాఖను 28న తాకాయి. నైరుతిలో రకరకాల దశలు ఉన్నట్టుగానే ప్రస్తుతం స్తబ్దత ఏర్పడడం వల్ల ఎండలు మండడానికి ఒక కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక్కోసారి చురుకుగానే నైరుతి కదలొచ్చని, ప్రస్తుతం నైరుతి వచ్చినంత వేగంగా ముందుకు వెళ్లలేకపోతోందని అంటున్నారు. ఈ కారణంగానే రాష్ట్రంలోని 2 వేలకు పైగా ఆటోమేటిక్ రెయిన్ గేజ్‌లుండగా కేవలం 254 రెయిన్ గేజుల పరిధిలోనే వర్షాలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారి కుమార్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఈ పరిస్థితి ఇలా ఉండిపోదన్నారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకూ సమ్మర్ మాన్‌సూన్ నడుస్తుండడం కూడా వానల ఆగమనానికి కొంత ఆటంకం ఏర్పడిందన్నారు.

పలు ఆవర్తనాలతో వానలకు అవకాశం

ప్రస్తుతం వాతావరణ వ్యవస్థలో కొంత మార్పు రావడంతో దక్షిణ కోస్తా ప్రాంతంలో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడి ఉందని, తూర్పు నుంచి పడమర వరకూ మరో ఉపరితల ఆవర్తనం గుండా ఇది విస్తరించి ఉన్నందున రాగల 3 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక చోట్ల వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నట్లు విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

జిఒ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇంజనీరింగ్ వర్కర్లకు జిఒ 36 ప్రకారం అన్ స్కిల్డ్‌కు రూ.21 వేలు, సెమీ స్కిల్డుకు రూ 24,500 చెల్లించాలని,అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, డెత్, రిటైర్డ్ పోస్టులను కార్మికుల బిడ్డలతో ఫిల్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు చేయాలని, 17 రోజుల సమ్మె ఒప్పందం వెంటనే అమలు చేయాలని కోరుతూ చేస్తున్న రాష్ట్ర సమ్మెలో కార్మికులంతా భాగస్వాములు కావాలని జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ఫ్రంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి పిలుపు ఇచ్చారు. శుక్రవారం తాటిపూడి రిజర్వాయర్ పంప్‌హౌస్ కార్మికుల ఉద్దేశించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్త సమ్మె చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతు తెలుపుతూ వారి సమ్మె డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతుగా శనివారం 10:30 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం నుండి పారిశుధ్యం, మలేరియా, వెటర్నరీ, పార్కులు, క్రాప్ డ్రైవర్లు, లోడర్లు సకల కార్మికులు నిర్వహించే సంఘీభావ మహార్యాలీలో నీటి సరఫరా కార్మికులంతా పాల్గొనాలని కోరారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఉరికుటిరాజు, కోశాధికారి కె.వెంకటరావు, ఉపాధ్యక్షులు సిహెచ్ వి రాజు,కె.కనకరాజు తదితరులు ప్రసంగించారు.

ఆదివాసీ మహిళలకు సహ చట్టం గొప్ప ఆయుధం

ప్రజాశక్తి - అనకాపల్లి : ఆదివాసీ మహిళలు సమాచార హక్కు చట్టాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని ఆర్‌టిఐ కమిషనర్ రెహానా బేగం పిలుపునిచ్చారు. లిబ్ టెక్ ఇండియా, యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టిఐ, ఎపి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మన్యం, అల్లూరి సీతారామరాజు, ప్రకాశం జిల్లాల్లోని ఆదివాసీ మహిళలకు సమాచార హక్కు చట్టంపై ఈ నెల 14 నుంచి అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం మంగళగిరిలోని ఆర్‌టిఐ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి జూమ్ లైవ్ ద్వారా రెహానా బేగం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం గిరిజనులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పథకాలు, ఇతర అంశాల గురించి తెలుసుకునేందుకు సమాచారహక్కు చట్టం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో లిబ్ టెక్ ఇండియా ప్రతినిధి బిడిఎస్ కిషోర్, యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టిఐ క్యాంపెయిన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశావహ జిల్లాల అభివృద్ధికి సహకారం

కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆశావహ జిల్లాల (ఎస్పిరేషనల్ జిల్లాలు) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని కేంద్ర ప్రణాళిక, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ అన్నారు. ఆయా జిల్లాల ప్రత్యేక అభివృద్ధి అవసరాలపై తనకు నివేదిక అందజేస్తే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా జిల్లాలకు నిధులు మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఆశావహ జిల్లాల కార్యక్రమంలో భాగంగా నీతి ఆయోగ్ గుర్తించిన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, ఆర్థికాభివృద్ధి తదితర అంశాల్లో సాధించిన ప్రగతిని శుక్రవారం విశాఖ కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఆ జిల్లాల కలెక్టర్లు ఎఎస్.దినేష్ కుమార్, ఎ.శ్యాంప్రసాద్‌లు చేసిన ప్రజెంటేషన్ పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. నీతిఆయోగ్ జిల్లాలకు కేటాయించిన నిధుల వినియోగంపై కలెక్టర్లు తెలిపారు. జిల్లాల ప్రత్యేక అవసరాలను, అభివృద్ధిలో నిధుల పరంగా ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎఎస్ఆర్ జిల్లాను పూర్తిగా సేంద్రీయ ఉత్పత్తుల జిల్లాగా రూపొందించాలని భావిస్తున్నామని కలెక్టర్ దినేష్ కుమార్ చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలోని కొన్ని పాఠశాలల్లో క్రీడాభివృద్ధి కేంద్రాలను అభివృద్ధి చేసి ఆయా స్కూళ్లలో విద్యతోపాటు క్రీడలపై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. .ప్రస్తుత తరం గిరిజన విద్యార్థులు కనీసం ఇంటర్మీడియెట్ స్థాయి వరకు విద్యను పూర్తిచేసే విధంగా కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. కేవలం చెక్ డ్యామ్‌లపైనే ఆధారపడి పంటలు పండించే పరిస్థితి వుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో వెనుకబడి ఉందని ఆ జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. జిల్లాలో సూక్ష్మస్థాయి పరిశ్రమలు మినహా మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఏవీ లేవన్నారు. దీనిని అధిగమించేందుకు సాంకేతిక విద్య అవకాశాలు పెంపొందించేలా ఐటిఐలు, సాంకేతిక విద్యా సంస్థలు అధికంగా ఏర్పాటు చేయాల్సి వుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎఎస్ఆర్. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, రంపచోడవరం పిఒ కె.సింహాచలం, చింతూరు పిఒ అపూర్వ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు కాఫీపై ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్‌ను కేంద్ర మంత్రి ఇంద్రజిత్ సింగ్ పరిశీలించారు. ఎఎస్ఆర్ కలెక్టర్ దినేష్ కుమార్ ఆయనకు అరకు కాఫీ ప్రత్యేకతలను, ఈ ఉత్పత్తి మార్కెటింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. కేంద్ర మంత్రికి అరకు కాఫీ ప్యాకెట్‌తో పాటు చింతూరు ఏజెన్సీ ప్రాంతంలోని కూనవరం మండలం పైడిపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళలు చేతితో రూపొందించిన పట్టు చీరను బహూకరించారు.

ఎపిలో స్వార్థపూరిత ప్రతిపక్షం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : తమిళనాడులో పార్టీలు రాజకీయంగా విభేదించినా, రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పని చేస్తాయని, అదే మన రాష్ట్రంలో మాత్రం స్వార్థపూరిత ప్రతిపక్షం ఉండటం దురదృష్టకరమని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులు, తప్పిదాలు, దృష్టి మరల్చడానికి జగన్ విషం చిమ్ము తున్నారన్నారు. ప్రభుత్వం మీద విమర్శలు చేసి, అబద్ధాలే పునాదిగా చేసుకొని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

ఒపిఎస్ అమలు చేయాలి



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎస్ అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగానికి ఎంపిక కాబడి, ఇతరత్రా కారణాల వలన ఆలస్యంగా ఉద్యోగాల్లో చేరిన సిపిఎస్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు కేంద్రప్రభుత్వ మెమో 57 ప్రకారం పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం ఉమ్మడి విశాఖ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఫోరం నాయకులు కె.శ్రీనివాసరావు,ఎం.శ్రీనివాసరావు, సిహెచ్ రాము మాట్లాడుతూ 2003 డిఎస్సి నోటిఫికేషన్ సమయంలో ఒపిఎస్ అమలులో ఉండగా, 2004 తర్వాత అపాయింట్‌మెంట్ సమయానికి ఎన్‌పిఎస్ రావడంతో సదరు ఉద్యోగులకు ఎన్‌పిఎస్ అమలు చేయడం జరిగిందని తెలిపారు. అయితే దేశంలోని గోవా, కర్ణాటక,మహారాష్ట్ర తదితర 16 రాష్ట్ర ప్రభుత్వాలు, భారతీయ రైల్వేలు, తపాలా, సెంట్రల్ బెటాలియన్ ఫోర్స్‌లు తమ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం వెలువరించిన మెమో 57ను అనుసరించి పాతపింఛన్ పునరుద్ధరించడం జరిగిందని, అటువంటప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు పునరుద్ధరించరని ప్రశ్నించారు. యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు.కార్యక్రమంలో జాకీర్ ఆలీ, బి. సన్నిబాబు,ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్ రవినాయుడుతో ప్రణవ్ గోపాల్ సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విఎంఆర్డిఎ పార్క్ నందు నిర్మించతలపెట్టిన స్కేట్ బోర్డ్ పార్క్ నిర్మాణం అదేవిధంగా రుషికొండ వద్ద ప్రతిపాదిత వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా చేపట్టవలసిన చర్యలపై శుక్రవారం శాప్ ఛైర్మన్ రవినాయుడుతో కలిసి విఎంఆర్డిఎ ఛైర్‌పర్సన్ ఎంవి ప్రణవ్‌గోపాల్ తన ఛాంబర్లో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పై రెండు పనులకు సంబంధించి త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని ఇరువురు సంయుక్త ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నాన్ని క్రీడారంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో శాప్ డైరెక్టర్లు పిబివిఎస్ఎన్ బుచ్చిరాజు, ఎండి రమేష్‌కుమార్, విఎంఆర్డిఎ ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, బలరామరాజు, కార్యనిర్వహక ఇంజినీర్లు మధుసూదన్ రావు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మినీ థాయ్ స్పాపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అసాంఘిక కార్యకలాపాలపై విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. స్పా ముసుగులో ఢిల్లీ సహా నార్త్ ఇండియన్ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో గురువారం రాత్రి పోలీసులు దాడులకు ఉపక్రమించారు. సిఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ భరత్ తన సిబ్బందితో రామాటాకీస్ నుంచి సిరిపురం వెళ్లే దారిలో ఉన్న మినీ థాయ్ స్పా సెంటర్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ముగ్గురు నార్త్ ఇండియన్స్ సహా విశాఖకు చెందిన ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకుని రెస్క్యూ హోంకు తరలించారు. నిర్వాహకుడు రాజేష్ సహా విటుడిని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బెజవాడకు చెందిన ఈ స్పా సెంటర్ యజమానిపై కేసు నమోదు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ సిఐ భాస్కరరావు తెలిపారు. విశాఖ మహానగరంలో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి సమాచారమివ్వాలని ఎస్ఐ భరత్ కోరారు.

ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌ను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మాజీ మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నగరి టిడిపి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌ను తక్షణం అరెస్ట్ చేయాలని వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని వైసిపి నగర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్లు దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తం మహిళాలోకాన్ని కించపరిచేలా మాట్లాడిన భానుప్రకాశ్ వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత స్పందించాలని, అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. ఆయన వ్యాఖ్యలపై జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, కార్పొరేటర్ శశికళ, మహిళా విభాగం నాయకులు శ్రీదేవి వర్మ, మల్లేశ్వరి, విశాలాక్షి, చుక్క వరలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఆర్‌ఎం వెంకటేష్

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రమాదవశాత్తు మృతి చెందిన మామిడిలోవ గ్రామానికి చెందిన జి. సన్యాసప్పుడు భార్య అప్పలకొండకు రూ.10 లక్షల ఎస్‌బిఐ జనరల్ బీమా చెక్కును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు (ఏపీజీబీ) విశాఖ రీజనల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ శుక్రవారం అందజేశారు.మామిడిలోవ గ్రామంలో శొంఠ్యాం, వేములవలస బ్రాంచ్ మేనేజర్లు స్వప్న, శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఎం చిరంజీవి వెంకటేష్ మాట్లాడుతూ, 'బ్యాంకు ఖాతాదారుల కుటుంబాలకు బీమాతో భరోసాగా లభిస్తుందని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బీమా చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీతో అందిస్తున్న వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలు, ముద్ర, ఇతరత్రా సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ మల్లికార్జున రావు (వంటి), ఎంపిసి షానవాజ్, ఏరియా మేనేజర్ సురేష్‌బాబు, ఐరెక్స్ చానల్ మేనేజర్ భానుచంద్రనాయుడు, అభీజ్, మామిడిలోవ సిఎసి పిలు ఆదిలక్ష్మి, అమ్మాజీ, రమా పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు ధనుష్ కల్యాణమండపంలో స్థానిక ఎమ్మెల్యే పి. గణబాబు ఆధ్వర్యాన, వార్డుల వారిగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. రెవెన్యూ, జివిఎంసి, పోలీసుశాఖ, సచివాలయ సిబ్బంది ప్రజాసమస్యల పరిష్కార చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రోడ్లు, కాలువల సమస్యలతోపాటు రెవెన్యూ, సివిల్ సప్లై సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేగా వాటిపై సంబంధిత అధికారుల వివరణ కోరి, తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎనిమిదోజోన్ కమిషనర్ హైమావతి, తాహశీల్దార్ రమేష్, వార్డు కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, వాటర్ సప్లై డిఇఇ వీరయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయకుమార్, కూటమి నాయకులు బంగారు తులసిరాం, బాలసుబ్రహ్మణ్యం, బాల రాజేశ్వరరావు, మూర్తి పట్నాయక్, జీన్‌వేర్ రమేష్, నరవ అనూష, గవ్వా భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటర్నెట్‌తో రచనా నైపుణ్యం

ప్రజాశక్తి- ములగాడ : యువతలోనూ, ఔత్సాహిక రచయితల్లో రచనా సామర్థ్యం, నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇంటర్నెట్ ఎంతగానో దోహదపడుతుందని రచయిత కొయిలాడ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో గరిమ సాంస్కృతిక సంస్థ పుష్కరోత్సవాలలో భాగంగా ' అంతర్జాల సాహిత్యం- యువత' అనే అంశంపై ప్రత్యేక సదస్సులో ముఖ్య వక్తగా మాట్లాడుతూ- అంతర్జాలం వల్ల యువతకు రచనా నైపుణ్యం పెరుగుతుందని, సరికొత్త రచనలకు అవకాశం ఏర్పడుతుందని, అంతేకాక చేపట్టిన రచనలకు సులభంగా ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తుందని అన్నారు. అంతర్జాలంలో ఉండే ఇ -పుస్తకాలు, బ్లాగులు, సోషల్ మీడియా వేదికలపై అవగాహన కల్పించారు. సదస్సుకు సమన్వయకర్తగా వ్యవహరించిన ఉపాధ్యాయులు, రచయిత సిహెచ్. చినసూర్యనారాయణ, గరిమ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు కెవిఎస్. నరసింహం, వినియోగ సమాచారం సంపాదకులు హెచ్ఎస్. రామకృష్ణ, సెయింట్ ఆన్స్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు లక్ష్మీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఇపిఎస్. భాగ్యలక్ష్మి, వై. అనసూయాదేవి పాల్గొన్నారు.

ఫార్మాలో నైపుణ్యతపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఫార్మాలో క్వాలిటీ డిజైన్ :బహుళ విభాగాల పరిశోధన, అభివృద్ధికి ఒక వ్యవస్థాత్మక రూపకల్పన" అనే అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఔషధ రంగంలో ఫార్మాస్యూటికల్ విశ్లేషణ, క్వాలిటీ అస్యూరెన్స్ విభాగం పరిశోధకుడు డాక్టర్ సాగర్ సుమన్ పాండా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యువతకు ఫార్మశీ రంగంలో నాణ్యత, ప్రమాణాలు, ఫార్ములేషన్, అనలిటికల్ పద్ధతుల అభివృద్ధి, క్లినికల్ ట్రయిల్ క్వాలిటీ సిస్టమ్స్‌పై లోతైన అవగాహన కల్పించారు. క్వాలిటీ బై డిజైన్ మౌలికాంశాలు, డిజైన్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, అనువర్తనాలు ఫార్ములేషన్, అనలిటిక్స్, రెగ్యులేటరీ క్వాలిటీ అస్యూరెన్స్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డేటా ఆధారిత ఫార్మాస్యూటికల్ పరిశోధనపై ఆసక్తిని ప్రేరేపించడంతో పాటు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చెందే లక్ష్యాలపై యువతకు దిశా నిర్దేశం చేశారు. ఫార్మశీ విద్యార్థులు నిరంతరం అభ్యాసకులుగా కొత్త విషయాలను నేర్చుకుంటూ ఎదగాలన్నారు. భావప్రకటన సామర్థ్యం, పరిశోధనల పట్ల ఆసక్తి, ఎంపిక చేసుకున్న అంశాలపై లోతైన అవగాహన ద్వారా అంచెలంచెలుగా ఎదగాలన్నారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా డాక్టర్ జి.సౌజన్య సమన్వయకర్తగా వ్యవహరించారు. సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధన స్కాలర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న గీతం విద్యార్థులు, నిపుణులు

అనుమతుల్లేని కాలేజీ గుర్తింపు రద్దు చేయండి

ప్రజాశక్తి -గాజువాక : శీలా నగర్‌లో ఎటువంటి అనుమతుల్లేకుండా వివిధ పేర్లతో నడుపుతున్న మదర్ తెరిసా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ గుర్తింపును తక్షణమే రద్దు చేసి సీజ్ చేయాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఫణీంద్ర కుమార్, జిల్లా కార్యదర్శి యు నాగరాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా తల్లిదండ్రులను విద్యార్థులను వేధిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ నాయకుల దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లడంతో తగు చర్యలు తీసుకున్నామన్నారు. అయితే నర్సింగ్ కళాశాలపై ఇంతవరకు చర్యలెందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. డిఎంహెచ్ఓ పర్యవేక్షణాలోపం వల్లే నర్సింగ్ కళాశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా పర్మిషన్ లేకుండా కమర్షియల్ భవనాల్లో తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు..మదర్ థెరిసా స్కూల్ నర్సింగ్. మోహన్‌కృష్ణ, ఎంఎస్ఆర్, గ్లోబల్, యశోద నేషనల్, జయప్రియ, సిద్ధార్థ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఇలా పర్మిషన్ లేకుండా అనేక రకాల పేర్లతో అడ్మిషన్ తీసుకొని తల్లిదండ్రులను విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా డిఎంహెచ్ఓ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే వైద్యఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.బాబ్జీ, జిల్లా ఉపాధ్యక్షులు జెఅభిషేక్, ఆదర్శ్, శివరాజ్ కుమార్, వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు..

గాయత్రీనగర్‌లో వైద్య శిబిరం

ప్రజాశక్తి -మధురవాడ : డయేరియా వ్యాధులు ప్రబలిన జివిఎంసి ఆరో వార్డు గాయత్రీ నగర్ కాలనీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక యుపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుజన, డాక్టర్ స్వాతి గవరి ఆధ్వర్యంలో వైద్యబృందం పాల్గొని, డయేరియా పీడితులకు వైద్యసేవలు అందించారు. వ్యాధి నివారణకు సూచనలు చేశారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వైద్యశిబిరాన్ని వార్డు టిడిపి అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ సందర్శించి, రోగులకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డయేరియా నివారణకు సహకరించాలని కోరారు. వ్యాధి అదుపులోకి వచ్చేంత వరకు రౌండ్‌దిక్లాక్ సేవలు రోగులకు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. కలుషిత నీటి వల్లే డయేరియా ప్రబలినట్లు ప్రాథమికంగా భావిస్తున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బందికి సహకరించాలని సూచించారు.

ప్రతిభకు నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిల్లాలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని కస్తూర్బా విద్యాలయాల్లో గతేడాది టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థినులకు శుక్రవారం విజయనగరానికి చెందిన మహారాజా అలక నారాయణ సొసైటీ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ 5వేలు చొప్పున నగదు పురస్కారాలను అందించారు. పూసపాటి ఆనందగజపతి రాజు జయంతి వేడుకల్లో భాగంగా మాన్సాస్ ట్రస్ట్ ద్వారానగదు పురస్కారాలను గోవా గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అందజేశారని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జె చంద్రశేఖర్ తెలిపారు.మాన్సాస్ ట్రస్ట్‌కు, అశోక్‌గజపతికి మూడు కెజిబివిల ప్రిన్సిపల్స్, అధ్యాపకులతోపాటు విద్యార్థులు, ఎఎస్ఓ ఎపిసి చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. నగదు పురస్కారాలు అందుకున్న వారిలో భీమిలి, పద్మనాభం మండలాల కెజిబివిల నుంచి చెరో 16 మంది, ఆనందపురం మండలం నుంచి 18మంది విద్యార్థినులు ఉన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా మన్ననలు పొందుతున్న జెసిఐ వైజాగ్ చాప్టర్ సభ్యులు శుక్రవారం నగరంలో పలుచోట్ల తోపుడుబళ్ల వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. వేపగుంట ప్రాంతంలో ఎండలో తోపుడుబళ్లపై కొబ్బరిబోండాలను విక్రయిస్తున్న చిరు వ్యాపారులకు నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చేతుల మీదుగా గొడుగులు అందజేశారు. జెసిఐ వైజాగ్ ఛాప్టర్ అధ్యక్షురాలు జియ్యాని కావ్య, కార్యవర్గ సభ్యులు జెసి మోనికా శ్రీనివాస్ పాల్గొన్నారు.



గొడుగుల పంపిణీ చేస్తున్న జియ్యాని శ్రీధర్

నేరాలు ఘోరాలు

స్నేహితునిపై కత్తెరతో దాడి

- మద్యం మత్తులో రౌడీషీటర్ ఘాతుకం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ సీతమ్మధార : మద్యం మత్తులో స్నేహితుడుపైనే రౌడీషీటర్ కత్తెరతో దాడికి పాల్పడిన ఘటన గురువారం అర్ధరాత్రి కంచరపాలెం చాకలిగడ్డ వద్ద చోటుచేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.

పెందుర్తి ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్ నగల్ల సాయి, కంచరపాలెం చాకలి గడ్డ ప్రాంతానికి చెందిన తన స్నేహితుడు గోశాల మూర్తి ఇద్దరూ గురువారం రాత్రి మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో నగల్ల సాయి చిన్నపాటి కత్తెరతో మూర్తిపై దాడికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు 112కు కాల్ చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్న కంచరపాలెం పోలీసులు గాయపడ్డ మూర్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడ్డ నగల్ల సాయిని అదుపులో తీసుకునేందుకు ప్రయత్నించగా, మద్యం మత్తులో ప్రతిఘటించాడు. ఈ క్రమంలో అతని చేయి పోలీస్ రక్షక్ వాహనానికి తగలడంతో వాహనం వెనుక డోర్ అద్దం పాక్షికంగా దెబ్బతింది .ప్రస్తుతం సాయిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు కంచరపాలెం సిఐ రవికుమార్ తెలిపారు.

నూతిలో మునిగి వ్యక్తి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి గ్రామంలో ఓ వ్యక్తి నూతిలో స్నానానికి వెళ్లి మునిగి, చనిపోయాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... అసకపల్లి గ్రామానికి చెందిన కర్రి సంతోష్ (32) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య పిల్లలతో విశాఖపట్నంలో ఉంటున్నాడు. అసకపల్లిలో తల్లిదండ్రులు ఉండడంతో అప్పుడప్పుడు భార్య పిల్లలతో అసకపల్లి వస్తుంటారు. గురువారం అసకపల్లి వచ్చిన సంతోష్, ముగ్గురు మిత్రులతో కలిసి ఇరువాడ దరి నూతికి స్నానానికి వెళ్లారు. అయితే ఏం జరిగిందోమోగానీ, నూతిలో మునిగి సంతోష్ చనిపోయాడు మిగతా ముగ్గురు స్నేహితులు ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయారు. అందిన సమాచారంతో సంతోష్ భార్య సాయికుమారి విశాఖ నుండి అసకపల్లి చేరుకొని నూతి దగ్గరకు భర్త మృత దేహాన్ని గుర్తించింది. అతనితో స్నానానికి వెళ్లిన మిత్రులు అసకపల్లికి చెందిన కర్రి సాయి, నున్నగొప్పుల శివ, విశాఖ పూర్ణమార్కెట్‌కు చెందిన ఓలి శ్రీనివాసరావులపై అనుమానం వ్యక్తం చేసింది. అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని ఎన్‌టిఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ జి.రామచంద్రరావు తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -మాడుగుల:విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన అవురువాడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలివి. మాడుగుల మండలం వమ్మలి గ్రామానికి చెందిన బొద్దపు రాజుబాబు (55)భార్య లక్ష్మి కూతురుతో కలిసి అవురువాడ గ్రామంలో ఉన్న తన పామాయిల్ తోటలోకి పనికి వెళ్లారు. తోటలో పామాయిల్ గెలలు కోయడానికి ఇనుప గొట్టంతో చేసిన కత్తిని పైకి ఎత్తే క్రమంలో విద్యుత్‌వైర్లకు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే పడిపోయాడు. హుటాహుటిన కింతలి పిహెచ్‌సికి తరలించగా అప్పటికే మృతి చెందాడు మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు.

గంజాయి నిందితులను పట్టించిన డ్రోన్

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సుజాతనగర్ నాగమల్లి లేఔట్, కొండవాళ్ల ప్రాంతాల్లో గంజాయి నిందితులను డ్రోన్ పట్టించాయి. శుక్రవారం స్థానిక సిఐ కె.వి.సతీష్‌కుమార్ పర్యవేక్షణలో డ్రోన్ సర్వైలెన్స్ నిర్వహించగా, తుప్పల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండడాన్ని గమనించి, వారిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద 200 గ్రాముల గంజాయి పట్టుబడింది. విచారణలో వ్యక్తిగత వినియోగానికి గంజాయి కలిగి ఉన్నట్లు వెల్లడించడంతో వారిపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

భెల్ కార్మికులకు రూ.30 వేలు పిపిపి, ఇన్సెంటివ్

ప్రజాశక్తి -గాజువాక: భెల్ కార్మికులకు ప్లాంట్ పెర్ఫార్మన్స్ పేమెంట్ (పిపిపి), స్పెషల్ ఇన్సెంటివ్‌గా రూ.30వేలు చెల్లించాలని ఢిల్లీలో జరిగిన బెల్ జాయింట్ కమిటీ ఫెడరేషన్లలో సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈనెల వేతనాలతో రూ. 15 వేలు, దీపావళికి మరో రూ.15 వేలు చెల్లిస్తారు.కరోనా సమయంలో నిలుపుదల చేసిన లెట్ నైట్ స్నాక్ అలవెన్స్, ఒటి చెల్లింపులు, అలాగే భవిష్యత్ ప్లాంట్ పెర్ఫార్మన్స్ చెల్లించడానికి ఒక కొత్త ఫార్ములాను నిర్ణయించడానికి సబ్ కమిటీలను వేసి, ఆయా కమిటీల్లో చర్చించి నిర్ణయించాలని తీర్మానించారు. సమేచేశంలో ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి సంజీవరెడ్డి, సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి కె. తపన్‌సేన్, ఇతర జాతీయ కార్మిక సంఘాల జాయింట్ కమిటీ నాయకులు, వివిధ భెల్ యూనిట్ల ప్రతినిధులు,. ఉన్నత యాజమాన్యం సిఎండి సదాశివమూర్తి పాల్గొన్నారు

విద్యార్థుల సంఖ్య పెంపుతోనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ

ప్రజాశక్తి-గాజువాక : విద్యార్థుల నమోదును పెంచడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందనియుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నికయింది.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం

యుటిఎఫ్ గాజువాక మండలశాఖ నూతన తాత్కాలిక కమిటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇమంది ప్రసాద్, సబ్బారపు నూకరాజు, గౌరవాధ్యక్షులుగా కట్టిపోగు మురళీకృష్ణ, సహ అధ్యక్షులుగా మొహమ్మద్ అబ్దుల్ హక్, బి. సుగుణ, వి.ఎస్తేరురాణి, కోశాధికారిగా ఎస్‌వి.శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా నిడదవోలు శ్రీనివాస్‌రాజు, ఎ.విజయకుమారి, ఎస్.అపరంది, ఐ. స్వర్ణలత, బి.సువర్ణలత, ఎ.అన్నపూర్ణేశ్వరి, మండల కార్యవర్గ సభ్యులుగా రవికుమార్, అనితకుమారి, నీరజ, పి. విజయదుర్గ, సిపిఎస్ కన్వీనర్‌గా నూకరాజు,ఆడిట్ కమిటి సభ్యులుగా జ్యోత్స్న ఎన్నికయ్యారు.కార్యక్రమంలో, జిల్లా నాయకులు అప్పారావు, గోపాలపట్నం ప్రధాన కార్యదర్శి సింహాచలం, విజయకుమార్, ప్రసాద్, లక్ష్మి కుమారి, మహిమరావు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపిటిఎఫ్ భీమిలి పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్ర వారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డి ఈశ్వరరావు, అధ్యక్షులుగా సి హెచ్ మోహనకృష్ణ, ఉపాధ్యక్షులుగా టివి సతీష్ కుమార్, ఎన్ జయసుధ, ప్రధాన కార్యదర్శిగా ఆర్ కోటేశ్వరరావు, కార్యదర్శులుగా కె వెంకటరమణ, ఎస్ వరహాలబాబు, బి సూర్య ప్రభాకరరావు, ముగ్గురు జిల్లా కౌన్సిలర్లు, ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారని ఎన్నికల నిర్వహణాధికారి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి రామకృష్ణ తెలిపారు.

శంకర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం




కంటి రోగులను పరామర్శించి, పండ్లు ఇస్తున్న అయ్యన్న

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం శంకర్‌ఫౌండేషన్ కంటి ఆసుపత్రిని సందర్శించారు. ఇటీవల నర్సీపట్నంలో గో హాస్పిటల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో గుర్తించిన కంటి రోగులకు శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహించగా, కంటి రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీసి, కళ్లద్దాలు, మందులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శంకరరావు కుమారుడు కృష్ణకుమార్ ఆధ్వర్యంలో లాభాపేక్ష లేకుండా శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు.

జగ్గమ్మగెడ్డ రిజర్వాయర్ సమస్య పరిష్కరిస్తా

- రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, రైతులు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని కుసులవాడు పంచాయతీలోని జగ్గమ్మగెడ్డ రిజర్వాయర్ సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి రామానాయుడు హామీనిచ్చారు. గిడజాలలో సుపరిపాలన కార్యక్రమంలో తర్లువాడ గ్రామ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు వినతిపత్రం అందజేశారు 2005లో రూ.2 కోట్లుతో రిజర్వాయర్ నిర్మాణానికి 72 ఎకరాల భూమిని కేటాయించి, 19 ఎకరాల జిరాయితీ భూములకు నష్టపరిహారాన్ని కూడా చెల్లించారు. తరువాత నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడంతో ప్రాజెక్టు నిలిచిపోయిందని వివరించారు.దీంతో రెండు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరుతోపాటు ఈ ప్రాంతంలో తాగునీరు అందించే జగ్గమ్మగెడ్డ రిజర్వాయర్ పని ముందుకు సాగక అభివృద్ధి కుంటుబడిందన్నారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చిన వారిలో తాత్రాజు అప్పారావు గన్రెడ్డి సోంబాబు, కోరాడ రాము, వైకుంఠం, శనగం రామకష్ణ, కాకర వెంకటరమణ, బలిరెడ్డి మల్లికార్జునరావు ఉన్నారు.

అంతకుముందు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిడజాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధ్యక్షులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, నాయకులు గన్రెడ్డి సోంబాబు, ఎర్ర రాము, శ్రీకాంత్ రాజు ఆబోతు అప్పల రాము పాల్గొన్నారు

చెట్లు నరికివేతపై వాకర్స్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రాయలచెరువు వాకర్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెం రాయలచెరువు వాకింగ్ ట్రాక్ చుట్టూ ఉన్న చెట్లను నరికివేతపై శుక్రవారం వాకర్స్ అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం, నిరసన వ్యక్తం చేసింది. . ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు, యల్లాజీరావు మాట్లాడ 15 ఏళ్లుగా అనేక వ్యయ ప్రయాసలకోర్చి కోరమండల్ ఫెర్టిలైజర్ కంపెనీ సహకారం, సిఎస్‌ఆర్ నిధులతో సుమారు 3500 మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పెద్దవైన తరువాత అప్పగించారన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆనాటి మంత్రి, గంటా శ్రీనివాసరావు సహాయ సహకారాలతో వాకర్స్ ట్రాక్స్, అక్కడ పచ్చదనాన్ని అభివృద్ధి చేశామన్నారు. అయితే చెరువు గట్టుపై పదేళ్లకు పైగా ఉన్న భారీ చెట్లను ఇపుడు విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్నాయని అడ్డగోలుగా నరికేస్తున్నారని, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రత్యామ్నాయ చర్యలకు అవకాశం ఉన్నా, అవేవీ పట్టించుకోకుండా, వాకర్స్‌తోపాటు స్థానికుల మనోభీష్టానికి వ్యతిరేకంగా చెట్ల విధ్వంసానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే, ఇతర నేతలు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. అలాగే చెరువులోని కలుషిత జలాలు శుద్ధి చేసే ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఇటీవల వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఈ ప్రాజెక్టును మరమ్మతుల కోసం అర్బన్ బ్యూటిఫికేషన్‌విభాగానికి అప్పగించారని, ఇంతలోనే చెట్లను నరికేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎంవి రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మేడిశెట్టి వెంకటరమణ, రామచంద్ర దాస్, పుప్పాల హనుమంతరావు, గోలి జగన్, ఉదయశంకర్, పత్రాజు,మోహన్ రావు, వెంకటేశ్వరావు, దివాకర్,భాస్కర్, శ్రీనివాస్, రామారావు, వాకర్స్ పాల్గొన్నారు.

ఎంఎంసి డైరెక్టర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాడ గౌరీ, అప్పారావు దంపతులను వెల్లంకి గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, దళిత యువజన సంఘం అధ్యక్షులు ఉప్పాడ సీతారామ్ శుక్రవారం పూలమాల వేసి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ, కూటమి పాలనలో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆశీస్సులతో ఉప్పాడ గౌరీకి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు గుడివాడ శ్రీను, ఎదురు సాయి,



గౌరి దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

వశి పైడిరాజు, పైలా నాయుడు, రావాడ అప్పలరాజు, ఆర్. సూరిబాబు, చిన్నారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు ఆరిలోవ కాలనీ కనక దుర్గానగర్, న్యూ అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో జివిఎంసి నిధులు రూ.30లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ, గతంలో నిర్మించిన, పూర్తిగా పాడైన తారురోడ్లుస్థానంలో సిమ్మెంట్ రోడ్లు వేయనున్నట్టు తెలిపారు. జివియంసి ఎస్ఇ కృష్ణారావు, ఇఇ శాంతిరాజు, డిఇఇ వెంకటరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, ఏడువవాక సన్యాసిరావు, పోలారావు, కొత్త గోపాల్, దువ్వి తాతారావు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో అశోక్ గజపతి



కుటుంబసభ్యులతో అశోక్‌గజపతి రాజు

ప్రజాశక్తి- వేపగుంట : గోవా గవర్నర్ నియమితులైన తర్వాత తొలిసారి సింహాద్రి అప్పన్నను ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఇఒ వేంద్ర త్రినాధరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేసిన అశోక్ గజపతిరాజు, అంతరాయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందించారు. ఇఒ వేంద్ర త్రినాధరావు శేష వస్త్రంతో అశోక్‌దంపతులను సత్కరించి, స్వామి జ్ఞాపికలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డైట్ ప్రిన్సిపల్, యంత్రాంగం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్ పర్యవేక్షణలో డిఇఇ సెట్ 2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. కాలేజీలో 100 సీట్లకు గాను, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో చెరో 50 చొప్పున సీట్లను కేటాయించారన్నారు. తొలి విడత కౌన్సిలింగ్ ద్వారా 93 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో తెలుగు మీడియం 43, ఇంగ్లీష్ మీడియం 50 సీట్లు ఉన్నట్లు వివరించారు. డిఇఇ సెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

పదో వార్డు వైసిపి అధ్యక్షునిగా పతివాడ



పతివాడ కనకరాజు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి పదో వార్డు వైసిపి అధ్యక్షునిగా పతివాడ కనకరాజు మళ్లీ నియమితు లయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్.జగన్మోహనరెడ్డి శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ గతంలో అధ్యక్షునిగా పార్టీకి చేసిన సేవలను గుర్తించి, మళ్లీ పదవినిచ్చారన్నారు. ఈ మేరకు అధినేత జగన్మోహనరెడ్డితోపాటు పదవి రావడానికి సహకరించిన ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ ఎంపి ఎంవివి.సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణ్, పార్టీ ఇన్‌చార్జ్ రవి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయపరుస్తూ పార్టీ బలోపేతానికి, విజయానికి కృషి చేస్తామన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -పద్మనాభం. మండల కేంద్రమైన పద్మనాభంలో పద్మనాభం జంక్షన్ నుండి సచివాలయం వరకు రూ.మూడు లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సిసి డ్రైనేజీ పనులకు శుక్రవారం ఎంపిపి కె.రాంబాబు శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిపి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయకుమార్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం
- వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం


రౌంట్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం, పాల్గొన్న వివిధ సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అదాని విద్యుత్తు స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై విపరీతమైన విద్యుత్తు ఛార్జీల భారం పడుతుందని, వాటిని వ్యతిరేకించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం ప్రజలకు పిలుపునిచ్చారు. అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, ఛార్జీలు భారాన్ని తగ్గించాలని కోరుతూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ కనుసన్నల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటువరం చేయాలని చూస్తుందని మండిపడ్డారు. కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చారని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక స్మార్టుమీటర్లు బిగించడంతో పాటు విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో 2024-25 సంవత్సరానికి వినియోగదారులపై రూ.842కోట్లు సర్దుబాటు ఛార్జీల భారాలను మోపడానికి రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. 2024 ఏప్రిల్ నుండి యూనిట్కు 40 పైసలు చొప్పున వినియోగదారుల నుండి అదనంగా వసూలు చేసిన ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.2,787 కోట్లు వినియోగదారులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. తప్పుడు లెక్కలు ఇచ్చి అదనపు ఛార్జీలు వసూలు చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ స్మార్ట్మీటర్లు ప్రీపెయిడ్ మీటర్లని, ముందుగా రీచార్జ్ చేసుకోకపోవడం, విద్యుత్ పీక్ అవర్సను బట్టి ధరలను నిర్ణయించడం, మీటర్ ఖర్చు సుమారు రూ.13 వేలు వరకు వినియోగదారులపైనే వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దళిత, గిరిజనులకు, రైతులకు ప్రస్తుతం ఇస్తున్న రాయితీలు భవిష్యత్లో ఉండవన్నారు. సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు మాకిరెడ్డి రామానాయుడు, జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా ఆగస్టు 4 వరకు విస్తృతంగా ప్రచారం చేయాలని, ఆగస్టు 5న మండల కేంద్రాల్లో విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. సిపిఐ, సిపిఎం నేతలు ఆర్ దొరబాబు, గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల నేతలు ఆర్.శంకరరావు, కర్రి అప్పారావు, బి.వరమేశ్వరి, డిడి వరలక్ష్మి, బి.మాణిక్యం, వైఎన్ భద్రం, మణికుమార్, కే తేలయ్య బాబు, జే రమేష్ బాబు, సత్యనారాయణ, ఆర్.రాము, వివి శ్రీనివాసరావు, జి. సత్యనారాయణ, ముసలి నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన పాదయాత్రలు

తగరపువలస : స్మార్ట్ విద్యుత్మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఒకటో వార్డు బాలాజీనగర్, యాతపేట ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు భీమిలి మండల అధ్యక్షులు నీలాపు రాము, నాయకులు నరసింగరావు, చిన్నారావు, స్థానిక మహిళలు పోలమ్మ, కొండమ్మ, అరుణ పాల్గొన్నారు

ఆరిలోవ : స్మార్ట్మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనకు వ్యతిరేకంగా సిపిఎం ఆరిలోవ కమిటీ ఆధ్వర్యంలో ఆదర్శనగర్, వివేకానందనగర్ ప్రాంతాల్లో నిరసన చేస్తూ నిరసన చేపట్టారు. సిపిఎం నాయకులు వి.నరేంద్రకుమార్, జోన్ నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, వి.తులసిరామ్, వి.భూలోకరావు, డి.నాగరాజు పాల్గొన్నారు.

కొమ్మాది : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపుతో సిపిఎం ఆధ్వర్యంలో మారికవలస, శారద నగర్ లో ఇంటింటా కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. సిపిఎం నేతలు డి.అప్పలరాజు, డి. కొండమ్మ, బి భారతి,కె. సుజాత, ఆర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ములగాడ : విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్మీటర్లు బిగించొద్దని నినాదాలు చేస్తూ, నక్కవానిపాలెం, చైతన్యనగర్ హిమాచల్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రచారం



తగరపువలసలో పాదయాత్ర చేస్తున్న సిపిఎం నేతలు

చేశారు. సిపిఐ నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు, లక్ష్మి, కనక పాల్గొన్నారు.

40వ వార్డు ఎకెసి ఆంధ్ర స్టీల్ కాలనీ, 62వ వార్డు జనతా కాలనీ ప్రకాష్ నగర్లో సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలపై పాదయాత్ర నిర్వహించింది. శ్రీహరిపురం జివిఎంసి హాస్పిటల్ ప్రైవేటు పరం చేయొద్దని, స్మార్ట్మీటర్లను బిగించొద్దని నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి పైడిరాజు, నాయకులు ఎ.సత్యారావు, పి. రామారావు ఎల్. కృష్ణ,కే. పెంటారావు అర్జున్ రావు గణేష్ బి ప్రసాదు, బి జగ్గునాయుడు ఎం. కోటి వాసు నరేష్ సమీర్ పాల్గొన్నారు.

జివిఎంసి 59వ వార్డు ఎక్స్సర్వీస్మెన్ కాలనీ, వాయుపుత్ర కాలనీ, ములగాడ హౌసింగ్ కాలనీ, శాంతిగిరి కాలనీల్లో రోడ్ల సమస్య పరిష్కరించాలని, విద్యుత్ స్మార్ట్మీటర్లు వద్దంటూ సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం మల్కాపురం జోన్ నేతలు ఆర్.లక్ష్మణమూర్తి, బూడి. శ్రీను సురేష్, రామకృష్ణ, కుమార్, ఈశ్వరరావు పాల్గొన్నారు.!

గాజువాక : స్మార్ట్మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో 65 వ వార్డు భానోజీతోటలో పాదయాత్ర చేపట్టారు. గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి ఎం రాంబాబు, నాయకులు ఎం నాగేశ్వరరావు, టి శ్రీనివాస్, బి శ్రీనివాస్,వి మల్లేష్, త్రినాధ్, సిహెచ్ అప్పారావు, శివానంద పాల్గొన్నారు.

ఉక్కునగరం : స్మార్ట్మీటర్లను వ్యతిరేకిస్తూ పెదగంట్యాడ ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. సిపిఎం నాయకులు నమ్మి రమణ, డి వెంకటరావు, బి గుర్రప్పరెడ్డి, పాల అప్పలరెడ్డి పాల్గొన్నారు.

వడ్డాది : అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ఉపాధి హామీ పని ప్రదేశంలో ప్రచారం నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు పి.సాంబశివరావు స్మార్టు మీటర్లు వల్ల జరుగు నష్టాలపై కూలీలకు వివరించారు.



ఉక్కు నగరంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు



మల్కాపురం ప్రాంతంలో ప్రచారంలో పాల్గొన్న సిపిఐ నాయకులు


వడ్డాదిలో ఉపాధి హామీ పనిప్రదేశంలో ప్రచారం చేస్తున్న దృశ్యం


ట్యాంకర్తో నీరు తెచ్చి నారు మడి తడుపుతున్న రైతు

ఎండిపోతున్న వరినారు మడులు

- ట్యాంకర్లతో నీటిని తెచ్చి తడుపుతున్న రైతులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

వరుణుడు ముఖం చాటేయడంతో వరి నారు మడులు ఎండిపోతున్నాయి. పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని పలువురు రైతులు వరి విత్తనాలను ఆకుమడుల్లో వేశారు. అనంతరం వర్షాలు పూర్తిగా కురవకపోవడంతో, పాటు వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. దీంతో పొలాల్లో వేసిన వరి విత్తనాలు పైన పెంకకట్టి మొలకలు రాకుండా ఉండిపోవడంతో రైతుల్లో ఆందోళన ఎక్కువైంది. కొంతమంది రైతులు వ్యవసాయ మోటార్ల ద్వారా, మరి కొంతమంది బావుల్లో నీటిని తోడి ఆకు మడులు తడుపుతున్నారు. మోటార్లు, బావులు లేని రైతులు ట్యాంకర్లలో నుండి నీటిని తీసుకువచ్చి ఆకుమడులను తడుపుతున్నారు. మండలంలోని బంగారుమెట్టకు చెందిన దాసరి రమణ, కోటి, అనిమిరెడ్డి అప్పలనాయుడు, బుల్లిబాబు తదితర రైతులు శుక్రవారం ట్యాంకులతో నీటిని తెచ్చి ఆకుమడులను కాపాడుకోవడానికి తడిపారు.

తహశీల్దారుగా తిరుమలరావు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల తహసీల్దార్గా చింతా తిరుమలరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యలయంలో పని చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన సత్యనారాయణ అచ్యుతాపురం బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన తిరుమలరావును రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, విఆర్వోలు నారాయణరావు, ప్రసాద్, వృద్ధీ, ఉదయ్, శివాజీ, శ్రీను తదితరులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహశీల్దారు కశింకోట మండల రెవెన్యూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్గా మాధవి



ప్రజాశక్తి-చోడవరం : చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్గా జనసేన పార్టీకి చెందిన అల్లం మాధవి నియామకమయ్యారు. మాధవి గతంలో గోవాడ ఎంపీటీసీగా పని చేశారు. ఆమె భర్త రామప్పరావు జనసేన జిల్లాస్థాయిలో క్రియాశీలక బాధ్యతలు వహిస్తున్నారు. మాధవి నియామకం పట్ల కూటమి పార్టీకి చెందిన పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు : డిఎస్పి

ప్రజాశక్తి-పరవాడ : బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరవాడ డిఎస్పి విష్ణు స్వరూప్ హెచ్చరించారు. పరవాడ మండలంలో ఉన్న వైన్ షాపుల యాజమానులతో గురువారం సాయంత్రం డిఎస్పి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని, అలాంటి యజమానులపై కేసులు నమోదు చేసి షాపుల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల వద్ద మద్యం సేవించేందుకు కుర్చీలు, టేబుల్లు వంటివి ఏర్పాటు చేసి, అక్కడే మద్యం తాగించే విధంగా పరిస్థితులు నెలకొల్పడం గుర్తించబడ్డదని, ఇది నిబంధనలకు విరుద్ధమని, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడే మద్యం సేవించడానికి అనుమతించరాదని స్పష్టం చేశారు. సమావేశంలో పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు, పోలీసులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు సబ్సిడీపై ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గొర్లి గోవింద మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, సబ్సిడీతో సమయానికి అందించేలా కృషి చేస్తానన్నారు.

కాలువలో పసికందు మృతదేహం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని అంబేరుపురం వద్ద కాలువలో పసికందు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పసికందు మృతదేహాన్ని కాలువలో పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనకాపల్లి డిఎస్పి శ్రావణి, స్థానిక సిఐ అప్పలరాజు, ఐసిడిఎస్ పిఒ మంగతాయారు సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కార్యకర్తల ద్వారా గ్రామంలో ఉన్న గర్భవతులు, బాలింతలు వివరాలను సేకరించారు. నిండా నెలలు పూర్తికాని పసికందులా కనపడుతుందని ప్రాథమికంగా గుర్తించారు. ఎవరైనా గ్రామానికి చెందిన వారా? లేక బయట నుండి వచ్చే ఇక్కడ పడవేశారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలో ఉపాధి హామీ కార్మికులకు ఎనిమిద వారాలుగా బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని మడకపాలెం గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు ఎనిమిది వారాల నుండి కూలి డబ్బులు చెల్లించకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కూలి డబ్బులు రాక కార్మికులు అర్ధాకలితో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో మంచినీరు, మజ్జిగ వంటివి సదుపాయాలు, పనిముట్లు వేతనాలు, వేసవి వేతనం కూడా కలిపి 40శాతం అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ఆపాలన్నారు. ఏడాదికి 200 పనిదినాలు, రోజుకు రూ.600 వేతనం అమలు చేయాలని, కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం జీవో ప్రకారంగా రోజు వేతనం రూ.309 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు ఎం అమ్మాజీ, భవాని, ధనలక్ష్మి, రాశి, కూలీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

10 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పరిధిలో ఐదు రోజులుగా బిరిష్కు హాజరు కాని పదిమంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఇటీవల ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది హాజరు సమయపాలన, విధి నిర్వహణ, బోధన, క్రమశిక్షణ, లక్ష్య సాధన, పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. పాఠశాలల ప్రారంభ నేపథ్యంలో ఇంతవరకు చూసీ చూడనట్లు వ్యవహరించామని, ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించే ప్రాంతంలోనే రెండు పూటలా నిర్దేశించిన సమయంలో బిరిష్ హాజరు వేయాలని సూచించారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

టిడిపి కార్యాలయంలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసి నాయుడు టిడిపి శ్రేణులు, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీలను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొయ్యా నూకరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని దేవరాపల్లి సచివాలయ మహిళా పోలీస్ సంధ్యారాణి అన్నారు. దేవరాపల్లి సచివాలయం-1 పరిధిలోని రెల్లివీధిలో విలేజ్ లెవెల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి సంబంధించిన చట్టాలు, మహిళలకు సంబంధించిన రక్షణ హక్కులపై వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రాములమ్మ, గాయత్రి దేవి, వివోఏ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన శాప్ డైరెక్టర్

ప్రజాశక్తి-సబ్బవరం : ఏపి జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును శుక్రవారం ఏపి స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ డైరెక్టర్ పిబివిఎస్ఎన్.రాజులు విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నిమ్మల రామానాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి సాలువాతో ఘనంగా సత్కరించారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-సబ్బవరం : సంకరజాతి పశువులకు థైలేరియా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని ప్రాంతీయ పశు వైద్యశాల ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు అన్నారు. మండలంలోని అమృతపురం, బొండవానిపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన థైలేరియా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. 3 నెలలు వయసు దాటిన సంకరజాతి పశువులన్నిటికీ ఈ థైలేరియా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆరిపాక పశువైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత, అంతకాపల్లి పశువైద్యాధికారి డాక్టర్ అరుణ, గొట్టివాడ జేవివో వెంకట రమణ, పశుసంవర్ధక సహాయకులు వెంకటరావు, అప్పలరాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు చేసిన చెరువు పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం గ్రామ పంచాయతీ పరిధి రాయపురాజు చెరువులో రాత్రి సమయంలో యంత్రాలతో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని వైసీపీ నేతల ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆ చెరువును శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు రైతుల కోసం వాడుకోవాల్సిన మట్టిని కూటమి నాయకులు వారి స్వలాభం కోసం ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా చెరువులో మట్టిని తవ్వుకొని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీనిపై మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గండి రవికుమార్, కర్రి బాబు, మోపాడ అప్పారావు, వడ్డాది అప్పలరాజు, ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, ఎర్రా శ్రీను పాల్గొన్నారు.



మట్టి తవ్వకాలు చేసిన చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం నిషేధం
- కలెక్టర్ విజయ కృష్ణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యాధుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఎంపిడిఒలు, లైన్ విభాగాల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు అధికంగా ప్రబలే ప్రమాదం ఉండటంతో గ్రామాల్లో నీరు నిలిచే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, దోమల నివారణకు నిరంతర చర్యలు తీసుకోవాలని కోరారు. రాపిడ్ కిట్ల ద్వారా వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా నిర్వహించి, వ్యాధుల మూలాలను గుర్తించి నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. పురపాలక సంఘాల్లో యాంటీ లార్వా, ఫాగింగ్ ఆపరేషన్లు విస్తృతంగా చేపట్టి కాలువలు, డ్రైన్లలో మందులు పిచికారీ చేయాలని ఆదేశించారు. స్వచ్ఛత కోసం అవసరమైన క్లాప్ మిత్రులను నియమించి వారికి జీతాలు సమయానికి చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికార సమావేశాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డిపిఒ, డిపిఆర్సీ కోఆర్డినేటర్, జి.ఎస్.డబ్ల్యుఎస్, గ్రామీణ నీటి సరఫరా, ఏపీ ఈపీడీసీఎల్, డ్వామా ఏపీడి, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వడ్డాది పోస్టాఫీసులో రూ.8.32 లక్షల స్వాహా

పోలీసులకు తపాలా శాఖ అధికారుల ఫిర్యాదు

ప్రజాశక్తి-వడ్డాది

వడ్డాది తపాలా కార్యాలయంలో రూ.8.32 లక్షలు స్వాహా జరిగింది. పోస్టు మాస్టర్‌గా పని చేసిన నాగేశ్వరరావు ఈ సొమ్మును కాజేసినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. సొమ్మును తిరిగి రాబట్టేదిశగా ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... పోస్టుమాస్టర్ నాగేశ్వరరావు వారం రోజులుగా విధులకు హాజరు కావడం లేదు. ఖాతాదారులు కట్టిన ఆర్‌డి, ఇతరత్రా పొదుపు సొమ్మును ఎప్పటికప్పుడు నర్సీపట్నం డివిజన్ కార్యాలయంలో జమ చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా ఎక్కువ మొత్తంలో నగదును తమ దగ్గర ఉంచుకొని జమ చేయకుండా సొంత అవసరాలకు వినియోగించుకునే వారు. ఇటీవల ఆయన కార్యాలయానికి రాలేదు. రెండు రోజులపాటు సేవలు పూర్తిగా నిలిచిపోయి ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయ సిబ్బంది ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అనకాపల్లి నుంచి మరొకరిని ఇక్కడ నియమించి రోజువారీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని నర్సీపట్నం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్‌ను ఆదేశించారు. ఆయన వడ్డాది తపాలా కార్యాలయానికి వచ్చి దస్త్రాలన్నీ తనిఖీ చేసి సొమ్ము స్వాహా అయినట్లు నిగ్గుతేల్చారు. దీంతో పోస్టుమాస్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఈ పోస్టాఫీసులో రూ.62వేలు నగదు దొంగతనం జరిగింది. ఈ కేసులో స్థానిక యువకులను నాడు అరెస్ట్ చేశారు. తాజాగా ఇప్పుడు పోస్టల్ అధికారే డబ్బులు కాజేశారు. కాగా కొద్దికాలంగా ఇక్కడ ఎస్‌పిఎం పోస్ట్ డిప్యుటేషన్‌పైనే కొనసాగుతోంది. రెగ్యులర్ పోస్ట్ మాస్టర్‌ను నియమించాలని పోస్టల్ ఖాతాదారులు కోరుతున్నారు. రెగ్యులర్ ఎస్‌పిఎంను నియమిస్తే కొంత బాధ్యతగా పనిచేస్తారని భావిస్తున్నారు. పోస్ట్ ఆఫీసులో జరుగుతున్న వరుస సంఘటనలతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

భూ సేకరణపై గ్రామసభ

అభ్యంతరాలు తెలియజేసిన మల్లం, ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం గ్రామస్తులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని మల్లం, ఆర్.భీమవరం, ఆర్ శివరాంపురం గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూ సేకరణకు సంబంధించి శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. అధికారుల ఆదేశాల మేరకు ఈ గ్రామసభలు నిర్వహించినట్లు తహశీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. ఆర్.శివరాంపురం, ఆర్.భీమవరం, అప్పంపాలెం గ్రామాల్లో డి.పట్టా భూములు 315 ఎకరాలు, రైతుల సాగులో ఉన్న ప్రభుత్వ భూములు 44.323 ఎకరాలు, జిరాయితీ భూమి 375 ఎకరాలు, మల్లం, ఎం.బి.పాలెం, అప్పంపాలెం గ్రామాల్లో రైతుల సాగులో ఉన్న ప్రభుత్వ భూములు 142 ఎకరాలు, డి.పట్టా భూములు 498.318 ఎకరాలు, జిరాయితీ భూములు 224 ఎకరాలు, ప్రభుత్వ భూములు 89 ఎకరాలు మొత్తం 954 ఎకరాలకు భూసేకరణ చేస్తున్నట్లు తహశీల్దారు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభ్యంతరాలను తెలియజేశారు. ఎన్నో ఏళ్ల నుండి భూమిని నమ్ముకుని జీవిస్తున్నామని, తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఒక్కో ఎకరాకు ప్రభుత్వ భూములు, డి పట్టా భూములకు రూ.25 లక్షలు, జిరాయితీ భూములకు రూ.50 లక్షలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. మళ్లీ గ్రామసభలను నిర్వహించి తమ అభిప్రాయాలు తెలియజేస్తామని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కంచిపటి శ్రీనివాసరావు, సర్పంచు బల్లిన అమ్మునాయుడు, మాజీ సర్పంచ్ మల్లెడ్డి బుజ్జి, దేవర తాతాజీ, బోయిన నారాయణమూర్తి, గొల్లవిల్లి సత్యనారాయణ, గోలగాని రాజారావు, రైతులు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

పరిశ్రమల కోసం భూములు సేకరిస్తున్న మల్లం, భూపతిపాలెం, అప్పంపాలెం, ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం తదితర గ్రామాల రైతులకు ప్రభుత్వం తగిన న్యాయం చెయ్యాలని రాజాంకు చెందిన సామజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. డి పట్టా భూములకు ఎకరాకు రూ.50 లక్షలు, జిరాయితీ భూములకు ఎకరాకు రూ.70 లక్షలు, ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు రూ.35 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సెజ్‌లో భూములు కోల్పోయిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

సిఆర్‌పిల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపి క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం అనకాపల్లి జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జయప్రకాష్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఏపీసిఆర్పి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా 2011లో డిగ్రీ/పిజీ, బిఈడి/డిఈడి, టెట్ అర్హతలతో జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా రోస్టర్ కం మెరిట్ విధానంలో సిఆర్‌పిలను ఎంపిక చేశారని తెలిపారు. 13 సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొని వచ్చిన అనేక కార్యక్రమాలు అమలులో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సిఆర్పిలకు వేతనాల విషయంలో వివక్షకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పు తమకు అమలు కావటం లేదన్నారు. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌కు సమానమైన క్వాలిఫికేషన్స్ ఉన్నప్పటికీ కేవలం రూ.23,500 జీతం ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి ఐదేళ్లకు పిఆర్సీ అమలు చేస్తున్నట్లు తమకు కూడా అమలు చేసి జీతాలు పెంచాలని కోరారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఇంఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలన అధికారి టి.విజయ్ కుమార్ అర్జీలు స్వీకరించారు. ఉద్యోగుల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం డిగ్రీ కళాశాల గ్రౌండ్లో శనివారం జరుగు మెగా జాబ్ మేళాను నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువకులు వినియోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన జాబ్ మేళాకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. జాబ్ మేళాకు అధిక సంఖ్యలో యువకులు హాజరుకానున్నారని, వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వాహణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ పాల్గొన్నారు.

నేడు కశింకోట మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

21న దేవరాపల్లి మండల పరిషత్తు సమావేశం

దేవరాపల్లి : దేవరాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీఓ ఎంవి.సువర్ణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

గ్రామాల్లో టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో శుక్రవారం టిడిపి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్చార్జి సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, నాయకులు దొండా గిరిబాబు, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, శింగంపల్లి రమేష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం గ్రామంలో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మండల మాజీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, నాయకులు ఆదిరెడ్డి రామ్‌పూరి, బండారు శ్రీరామ్మూర్తి, ఆదిరెడ్డి అచ్చంనాయుడు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సూర్యనారాయణ తదితరులు



అజయ్‌కుమార్‌తో నేతలు

అజయ్ కుమార్‌ను కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి -మాడుగుల:రాష్ట్ర టిడ్కో గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ వేములు అజయ్ కుమార్ ని మాడుగుల మండలానికి చెందిన జనసేన పార్టీ నాయకులు శుక్రవారం ఉదయం పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో అప్పికొండ సమీపంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో జనసేన పార్టీ సమస్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుర్రెడ్డి శివాజీ, ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు, ఎం. కోటపాడు కోపరేటివ్ అధ్యక్షులు పిళ్ల నాయుడు, కన్నబాబు, గుమ్మాల నానాజీ, దయా యాదవ్ పాల్గొన్నారు.



కుర్చీలను ఇస్తున్న ముత్యాలనాయుడు

గ్రంథాలయానికి కుర్చీల వితరణ

ప్రజాశక్తి చీడికాడ: స్థానిక శాఖ గ్రంథాలయాన్ని అభివృద్ధి పరవాలనే ఉద్దేశంతో గ్రంథాలయానికి గ్రామ యువత ముద్రు ఈశ్వరరావు కుర్చీలను ఉచితంగా వితరణగా అందజేశారు.చీడికాడ గ్రామానికి చెందిన ముద్రు ఈశ్వర్ తమ సొంత నిధులతో 20 ప్లాస్టిక్ కుర్చీలను నన్నయ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ఆచార్య ముద్రు ముత్యాలునాయుడు, చీడికాడ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, యర్ర అప్పారావు, పరవాడ మహేష్ చేతులు మీదుగా అందజేశారు. పిల్లలకు ముద్రు ముత్యాలనాయుడు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జి వి మూర్తి, కాళ్ళ హరి, బాల రాజు, అనిల్, రాకేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్లాస్టిక్ నిర్మూలనపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్లాస్టిక్ నిర్మూలన పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ఎంపిడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్తులకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ వాడకంతో అనర్ధాల పట్ల వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఒపిఆర్డి రఘురాం పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయించి, క్లోరోనేషన్ చేయాలని ఎంపిడీవో సీతారామరాజు అన్నారు. మండలంలో అమలాపురంలో శుక్రవారం ఆయన పర్యటించారు. వాటర్ ట్యాంకులు పరిశీలించి, క్లోరోనేషన్ చేయించారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి ఇంటా తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. సంపద తయారీ కేంద్రం సందర్శించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.


విద్యుత్ సాకుతో.. 'తల్లికి వందనం' ఎగవేత

-ఆవేదనలో టిడిపి కార్యకర్త శివ కుటుంబం - గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసినా ఫలితం శూన్యం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రాజయ్యపేట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వాసుపల్లి శివ తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకానికి సంబంధించిన నగదు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేసాడు. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు ఉందని అనర్హత చూపుతూ తల్లికి వందనం పథకం తమకు నిలుపుదల చేశారని ఆవేదన వెలిబుచ్చాడు. తాను ఇప్పటివరకు 300 యూనిట్లు విద్యుత్తు వాడలేదని తెలియజేశాడు. స్థానిక ఏపీ ఈ పి డి సి ఎల్ కార్యాలయానికి వెళ్లి, అధికారులను సంప్రదించ చగా వారు రికార్డు పరిశీలించి, 300 యూనిట్లు కన్నా తక్కువ వినియోగించినట్లు రిపోర్టు ఇవ్వడం జరిగిందని, ఆ రిపోర్టును సచివాలయంలో గ్రీవెన్స్ లో దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ రెండవ విడతలో కూడా తల్లికి వందనం నగదు జమ కాలేదని వాపోయాడు. అనకాపల్లి కలెక్టరేట్ లో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినప్పటికీ ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆధార్ కార్డుకు ఎవరివో రెండు విద్యుత్ మీటర్లు యాడింగ్ అయినట్లు అధికారులు తెలియజేస్తే, మరలా ఈ పి డి సి ఎల్ కార్యాలయానికి వెళ్లి డిలీట్ చేయించానని, తల్లికి వందనం కోసం కార్యాలయాలు చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణలు చేసినప్పటికీ నగదు పడలేదని ఆవేదన వెలిబుచ్చాడు. అధికారులు స్పందించి తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని, లేనిపోని ఆంక్షలు పెట్టి పథకాన్ని ఎత్తివేయాలని చూడటం సరైన పద్ధతి కాదన్నాడు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న శివ



TO WHOM SO EVER CONCERNED

This is to certify that Smt/Sri VASIPALLI...SIVA.. D/o...DEMUDU........ Bearing SC No.113356G233 Village.RAJAYYAPETA...is utilizing Power consumpt than 300 units per month during last 12 months.

300యూనిట్లు లోపు వచ్చిన విద్యుత్ రిసిప్ట్

చెరువు స్థలంలో శ్మశానవాటిక భవనం వద్దు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్. నాగపురం స్కూలుకు ఎదురుగా ఉన్న చెరువు స్థలంలో శ్మశాన భవనం నిర్మాణం చేపట్టడం సరికాదని, దీనికి ఎప్పుడు తాను వ్యతిరేకమని గ్రామ సర్పంచ్ ఎలమంచిలి రఘురామ చంద్రరావు తెలి పారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామానికి శ్మశాన స్థలం ఉన్నప్పటికీ చెరువు గర్భంలో శ్మశాన భవనం నిర్మాణం చేపడుతున్నారన్నారు. దీంతో స్కూలు ఎదురుగా 50 మీటర్ల దగ్గరలో ఉండడంతో దహన సంస్కారాలు అయ్యేటప్పుడు విద్యార్థులు భయాందోళన గురవుతారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయమై జిల్లా కలెక్టర్కు భవనం ప్రారంభంలోనే గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ నిర్మాణం చేపట్టడంతో శ్మశాన స్థలం కబ్జాకు గురయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు, ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, వైసీపీ మాజీ అధ్యక్షులు పరవాడ కవి, వైసీపీ నాయకులు గొంతిన నాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్

జెడ్.జోగంపేటలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోవిందరావు

ప్రజాశక్తి -రావికమతం:రావికమతం మండలం జెడ్. జోగంపేట గ్రామంలో రేషన్ డిపో పాయింట్ ను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవింద్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చీమలపాడు పంచాయతీ పరిధిలో కళ్యాణపులోవ జిసిసి రేషన్ డిపో నెంబర్ :0319024లో 13 గ్రామాలలో 612 రేషన్ కార్డులు కలిగి ఉన్నాయన్నారు. జెడ్.జోగంపేట కేంద్రంగా పెదగరువు, రాయపాడు, రొచ్చు పనుకో, తాటిపర్తి, గంగంపేట, నేరడబందా, జెడ్.జోగింపేట, కడగడ్డ, బంగారుబందలు వంటి గ్రామాలు ఉన్నాయన్నారు. రేషన్ సరుకుల కోసం 13 కిలోమీటర్లు దూరంలో ఉన్న కళ్యాణపులోవ డిపోకు వెళ్లి సరుకులు తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలో సొంత గ్రామాలలోనే ప్రతి ఇంటికి రేషన్ సరుకులు అందేవన్నారు. ఇటీవల కాలంగా రేషన్ డిపోల వద్ద సరుకులు పంపిణీ చేయడంతో డిపో కేంద్రానికి శివారు గ్రామాలన్నీ రావాలంటే చాలా కష్టతరంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 13 కిలోమీటర్లు మేర నడుచుకొని వెళ్లి డోలీలకు, కర్రలకు, సరుకులను కట్టి భుజాలపై మోసుకొని రావలసిన పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ఆదివాసి గిరిజనుల సమస్యలపై స్పందించి జెడ్.జోగంపేట కేంద్రంగా డిపో పాయింట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు . ఈ ప్రాంతాలలో సెల్ టవర్లు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్ అందలేదన్నారు.రేషన్ సరుకులు లబ్ధిదారులకు ఇవ్వడం కొరకు కొండలెక్కి ఫింగర్ ప్రింట్స్ వేయించుకోవలసిన పరిస్థితి నెలకొందన్నారు. గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య అధికంగా ఉన్న కారణంగా ఆఫ్లైన్లో రేషన్ బియ్యం, పెన్షన్ అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వంతుల చిరంజీవి. పాంగి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావుకు సత్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి డిప్యూటీ ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన చలపతిరావును శుక్రవారం ఎంపీడీవో డి.సీతారామరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. డిప్యూటీ ఎంపీడీవో గా చలపతిరావు విధుల్లో చేరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి , శాలువాతో సత్కరించారు.



సత్కరిస్తున్న సిబ్బంది



పరీక్షా పత్రాన్ని చూపుతున్న విద్యార్థులు

విద్యార్థులకు గణితం టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతి విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గణితం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం జయశ్రీ పరీక్ష పర్యవేక్షించారు. 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు ఎం.ఆనంద్, సెక్రటరీ ఎం జయప్రకాష్ మాట్లాడుతూ, ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రములతో పాటు బహుమతులను కూడా త్వరలో అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎ.వి.ఎల్.ఎన్. కుమారి, ఎస్.ఫాల్గుణరావు, వి.పద్మావతి, దవరశింగి నాగేశ్వరరావు,రమేష్ బాబు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న నాయకులు

సొసైటీల అధ్యక్షులు, డైరెక్టర్లకు సన్మానం

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లిలో టీడీపీ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో పిఎసిఎస్ ల అధ్యక్షులు, డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. నక్కపల్లి పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జిగా కొప్పిశెట్టి బుజ్జి, వేంపాడు పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జిగా వెలగా శ్రీనివాసరావు, గొడిచెర్ల పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జిగాదార్ల కృష్ణలతో పాటు డైరెక్టర్లను నియమిస్తూ హోం మంత్రి వంగలపూడి అనిత సిఫారసు మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వీరందరికీ పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

టిడిపి మండల అధ్యక్షునిగా శంకరరావు

ప్రజాశక్తి-రావికమతం:రావికమతం మండల నూతన టిడిపి పార్టీ అధ్యక్షునిగా చినపాచిల సర్పంచ్ కోమటి శంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రావికమతం మండల టిడిపి పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం స్థానిక గంజి వారి దేవాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఈ పదవి కొరకు నలుగురు పేర్లు వ రిశీలనలో కి వచ్చినప్పటికీ అత్యధిక శాతం చినపాచిల గ్రామానికి చెందిన సర్పంచు కోమటి శంకరరావు పేరును సూచించడంతో పార్టీ ఎన్నికల పరిశీల కులుగా వ్యవహ రించిన సూర్యనా రాయణ ఆయన పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకరరావు మాట్లాడుతూ, మండలంలో పార్టీ బలోపేతానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా జరిగే విధంగా చూస్తానన్నారు. పార్టీ కార్యకర్తల సూచనలు, సలహాలు, అభిప్రాయాల మేరకు నడుచుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ అధిష్టానం తమకు అప్పగించిన బాధ్యతను తప్పకుండా శిరసావహించి కష్టపడి పనిచేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కొండనాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న నాయకులు

పారా స్పెషల్ ఒలింపిక్

కోచ్‌గా మహాలక్ష్మి నాయుడు



ప్రజాశక్తి- రావికమతం: ఈనెల 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు చత్తీస్ గడ్ రాష్ట్రంలోని బిలాస్ పూర్ లో జరగనున్న జాతీయ స్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ బోసి గేమ్ క్రీడా పోటీలకు మన రాష్ట్రం నుండి దివ్యాంగ బాలురకు స్పెషల్ ఒలంపిక్ భారత్ కోచ్ గా రావికమతం మండలం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు ఎంపిక అయ్యారని మేడివాడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రామారావు మాట్లాడుతూ, మన రాష్ట్రం నుండి జాతీయస్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ బోసి గేమ్ క్రీడా పోటీలకు ఆరుగురు బాలబాలికలు ఎంపిక కావడం జరిగిందని , వారిలో మన రావికమతం మండలం కొమిర గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థిని నక్కరాజు బాల సరస్వతి కూడా పాల్గొంటారన్నారు. వీరందరూ ఈనెల 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు చత్తీస్ గడ్ రాష్ట్రంలో బిలాస్ పూర్ లో జరగనున్న జాతీయ స్థాయి దివ్యాంగుల స్పెషల్ ఒలంపిక్ భారత్ బోసి గేమ్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని వారికి కోచ్ గా మహాలక్ష్మి నాయుడిని మన రాష్ట్రం నుండి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.



నిరసన తెలియజేస్తున్న మహిళలు

తాగునీటి సమస్యపై మహిళల నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ:తాగునీటిని సరఫరా చేయాలని మండలంలోని జోగుంపేట పంచాయతీ పేటమాలపల్లి గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. నీటి సరఫరా కాకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్షణమే అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఏవో మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.



నిరసన చేపడుతున్న గ్రామస్తులు

ఆ టీచర్ మాకొద్దంటూ నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం అర్ల ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము మాస్టర్ మాకొద్దంటూ శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ధర్నా చేశారు. మా ఆదివాసీ గిరిజనులపై అన్యాయంగా అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అలాగే పిత్రగెడ్డ, నీలిబంద పివిటిజి పిల్లలకు చెక్కిలు, గుడ్లు, ఇవ్వడం లేదన్నారు. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే వేరే ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పాడి లక్ష్మీ, వైస్ చైర్మన్ పాడి శ్రీను, తల్లిదండ్రులు పాడి నూకరాజు, కిముడు లలిత, కిముడు గంగరాజు, దుక్క శ్రీదేవి, బాణం అప్పారావు, దేశగిరి ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో చందనాడ గ్రామం లో అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో డి సీతారామరాజు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం బాలింతలకు, గర్భిణీలకు పోషకాహారం అందజేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

బెల్ట్ షాపులు తొలగించాలి

ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ధర్నా



ఆందోళన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:బెల్టు షాపులను తక్షణమే తొలగించాలని కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు మాట్లాడుతూ, కల్లుగీత కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోకపోయినా వృత్తి చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ప్రకృతి సహజ సిద్ధమైన తాటికల్లును ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఊరు వాడా ఎక్కడపడితే అక్కడ బెల్ట్ షాపులు పెట్టించి విచ్చలవిడిగతా మదం అమ్మిస్తుందన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా మద్యం అమ్ముతున్నందన కల్లు అమ్మకాలు లేక కల్లుగీత కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. జిల్లాలో అనధికారికంగా 3వేలకు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయంటే సంబంధిత అధికారులు వాటిని తొలగించకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే జిల్లాలోని 3వేల బెల్ట్ షాపులు తొలగించేందుకు విఆర్‌ఎ, సచివాలయ పోలీసులు, సర్పంచ్, గీత కార్మికుల సొసైటీ అధ్యక్షులతో గ్రామ కమిటీలు వేయాలని, వృత్తిలో చనిపోయిన వారికి రూ.5లక్షలు, శాశ్వత వికలాంగులకు రూ.10లక్షలు, తాత్కాలిక వికలాంగులకు రూ.2లక్షలు ఇవ్వాలన్నారు. అన్ సీజన్లో ఇతర వత్తులు చేసుకునేందుకు 50 శాతం సబ్సిడితో రూ.5లక్షల చొప్పున రుణాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తిన నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు జి.రాము, జిల్లా సహాయ కార్యదర్శి కె.ఈశ్వరరావు, కోశాధికారి ఎన్.నూకరాజు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : దళితుల అభివృద్ధికి జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ కృషి చేయాలని జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్‌కు జిల్లా దళిత బహుజన ఆదరణ సేవా సమితి సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత నిరుద్యోగ యువతీ యువకులకు రుణాలు ఇప్పించాలని, ఎన్ఎస్ఎఫ్‌డిసి స్కీములు పున:ప్రారంభించాలని కోరారు. పక్కా గృహాలు నిర్మించాలన్నారు. దళితుల భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి చిన్న అప్పారావు, కట్టమూరు మంగరాజు, బోని గణేష్ పాల్గొన్నారు.

తహశీల్దార్లపై చర్యలు తీసుకోవాలి

క్రైస్తవ మతాన్ని స్వీకరించి మతాచారాలు పాటిస్తున్న దళితులకు ఎస్సీ హిందువు అని తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్న తహసీల్దార్లపై చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రకు హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపన అధ్యక్షులు బోని గణేష్, సంఘ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం ఇస్తున్న సమితి సభ్యులు

నేడు ఇంటి పన్నుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీలో ఇంటి పనులు దుర్వినియోగంపై శనివారం విచారణ జరగనుంది. పంచాయతీకి చెందిన ముగ్గురు బిల్లు కలెక్టర్ల వసూలు చేసిన ఇంటి పన్నుల నగదును తమ సొంతానికి వినియోగించుకోవడంపై అధికారుల కమిటీ విచారణ చేపట్టనుంది. నిధుల దుర్వినియోగం అంశంపై వివిధ పత్రికల్లో రావడంతో విచారణ కమిటీ అధికారులుగా పంచాయితీ డివిజనల్ అధికారి, మండల పిఓపిఆర్డి, బాగోపురం కాందర్శి అధికారులుగా వ్యవహరించనున్నారు. పరిశీలన అనంతరం నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించనున్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలేదీ ?

మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి -మాడుగుల :అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేయడం సీఎం చంద్రబాబునాయుడు నైజమని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శుక్రవారం మాడుగుల బసవ పరమేష్ గోదాం లో జరిగిన 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' అనే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు ప్రజల్ని మోసం చేయడం ఇది మొదటి సారి కాదని, ఎప్పుడు గెలిచినా ఇలాగే చేస్తాడని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు నాయుడు మరిచిపోయారని తెలిపారు. రైతులకు ఆర్థిక సహాయం కింద ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ఇంకా అమలుల్లోకి రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, వైస్ ఎంపీపీలు విజయలక్ష్మి, కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రామాదర్మజ, వైసీపీ టైన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీను, యువజన అధ్యక్షులు బన్నీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు సోలం రమేష్, సర్పంచ్ యడ్ల కళావతి పాల్గొన్నారు.

పాయకరావుపేట:రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని వైసిపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ధ్వజమెత్తారు మండలంలోని పెంటకోట గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కంబాల జోగులు మాట్లాడుతూ, రాష్ట్ర హోం మంత్రిగా ఉన్న వంగలపూడి అనిత రాష్ట్రంలో శాంతిభద్రతలు మర్చిపోయి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. జగన్ విమర్శించే స్థాయి అనితకు లేదన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన కొనసాగుతుందని ఐఏఎస్ లు, ఐపీఎస్ లు కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను కూరలో కరివేపాకులా వాడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించారన్నారు, ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లంకా సూర్యనారాయణ, ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, ధనిశెట్టి సత్య మహేష్, కోడా కోటేశ్వరరావు, పడాల సోమన్న దొర, పన్నీరు పాపారావు, సఖిలేటి రాము, తమర్సి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



క్యూఆర్ స్కాన్‌ను ఆవిష్కరిస్తున్న బూడి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని అడ్డలోతవ, సుద్దలపాలెం గ్రామాల్లో గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సూపర్వైజర్ సిహెచ్‌విఎస్.ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో గొల్లవీధిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, ప్రిన్సిపల్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ రాములమ్మ, లీగల్ అడ్వైజర్ సునీత, ఎఎంఎఎల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయబాబు పిలుపునిచ్చారు. స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో శుక్రవారం డిగ్రీ విద్యార్థినులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల నష్టాలు, ఆడవారిపై జరుగు నేరాలు తగిన శిక్షలు అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలను సేవించడం ద్వారా నేర ప్రవృత్తికి అలవాటు పడి, మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇది సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. శక్తి యాప్ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపర్మెంట్ కోఆర్డినేటర్ సామ్రాజ్యం పాల్గొన్నారు.



సామగ్రిని అందజేస్తున్న సర్పంచ్

విద్యార్థులకు బ్యాగ్‌లు, షూలు పంపిణీ

ప్రజాశక్తి- రావికమతం:పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న బ్యాగులు, షూలను సర్పంచి దాసరి సూర్య కుమారి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. మండలం కవగుంట ఎం.పీ.యు.పీ పాఠశాలలో చదువుతున్న సుమారు 70 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు తల్లిదండ్రులకు, ఆర్థికంగా భారం పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, పుస్తకాలు, వంటి సామగ్రిని అందజేస్తుందన్నారు. చైర్మన్ శ్రీను పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణకు నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్.నాగాపురం గ్రామంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మొట్టడం సత్యనారాయణ 18వ వర్ధంతిని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సత్యనారాయణ ఎమ్మెల్యేగా చేసిన సేవలను కొనియాడారు.